క్లుప్తంగా

జనతా బీమా చెక్కు అందజేత



చెక్కు అందిస్తున్న దృశ్యం

పెనుకొండ: మండలంలోని వెంకటగిరిపాళ్యానికి చెందిన ఈశ్వరప్ప కుమారుడు శివయ్య కుటుంబానికి జనతా బీమా చెక్కును సింగిల్ విండో అధ్యక్షుడు సూర్యప్రకాష్‌రెడ్డి శుక్రవారం అందించారు. శివయ్య 2023 ఫిబ్రవరిలో 44వ జాతీయ రహదారిపై పాలసముద్రం వద్ద రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. మృతుడు పీఏసీఎస్‌లో క్రాప్‌లోన్ తీసుకొని, రెన్యూవల్ చేస్తుండేవాడు. రూ. 2 లక్షల బీమా పరిహారం మంజూరయ్యింది. కార్యాలయంలో చెక్కును బాధితురాలు రామాంజినమ్మకు అందించారు. జెడ్పీటీసీ గుట్టూరు శ్రీరాములు, మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు శ్రీనివాసులు, నాయకులు రామ్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

జాబ్‌మేళాకు స్పందన



మాట్లాడుతున్న ట్రస్టు సెంటర్ రీజినల్ హెడ్ శ్రీనివాస్

హిందూపురం: కొడికొండ సమర్థనం దివ్యాంగుల సంస్థ ఆధ్వర్యంలో స్థానిక బాలయేసు డిగ్రీ కళాశాల ఆవరణలో శుక్రవారం నిర్వహించిన జాబ్‌మేళాలో 80 మందికి ఉద్యోగాలు లభించినట్లు డీఆర్‌డీఏ పీడీ రామిరెడ్డి తెలిపారు. జాబ్ మేళాలో అమేజాన్, నేహా, టెక్స్‌పోర్టు, ఇన్నోవా, సుందరీ, ఓఎఫ్ఎక్స్, మ్యాన్‌పవర్, టీంలీప్స్, గ్రీన్‌టెక్, వింధ్య కంపెనీలు పాల్గొన్నాయి. సుమారు 250 మంది ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. కార్యక్రమంలో కొడికొండ సెంటర్ హెడ్ వెంకటేశ్వర్లు, రీజినల్ హెడ్ శ్రీనివాస్, ప్రిన్సిపాల్ జబివుల్లా ఖాన్, ఏపీఎస్ఎస్‌డీసీ కోఆర్డినేటర్ సాయివెంకటరమణ, మొబిలైజర్ మహేష్, ఉమా మహేష్, ట్రైనర్ కవిత, నరసింహులు, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ ఎర్రిస్వామి, వార్డెన్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

గుడిసెల తొలగింపు



గుడిసెలను తొలగిస్తున్న పోలీసులు, అధికారులు

పెనుకొండ: పట్టణంలోని మడకశిర రహదారి పక్కన సర్వేనంబర్ 668లో వేసిన గుడిసెలను రెవెన్యూ అధికారులు,పోలీసులు శుక్రవారం తొలగించారు. ప్రభుత్వ భూమిలో పట్టణ ప్రజలు, సీపీఎం ఆధ్వర్యంలో గుడిసెలు వేసుకున్నారు. గతంలో రెండుసార్లు ఇదే భూమిలో వేసిన గుడిసెలను అధికారులు తొలగించారు. నిషిద్ధ బోర్డును కూడా ఏర్పాటు చేశారు. నిబంధనలు ఖాతరు చేయకుండా మూడోసారి కూడా గుడిసెలు వేసుకోవడంతో శుక్రవారం ఉదయం భారీ ఎత్తున పోలీసులు, రెవెన్యూ అధికారులు వెళ్లి గుడిసెలు తొలగించారు. అనంతరం మడకశిర సర్కిల్‌లో ప్రజలు ధర్నా చేశారు. అయితే పోలీసులు వారిని వాహనాల్లో స్టేషన్‌కు తరలించారు. ఈ సమయంలో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. తహసీల్దార్ సురేష్, కమిషనర్ వంశీకృష్ణభార్గవ్ సీఐ రాజా రమేష్, ఎస్ఐలు రమేష్‌బాబు, రాజేష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు పరిశీలన

మడకశిర: పట్టణంలోని మారుతినగర్ (17వ వార్డు)లో శుక్రవారం మున్సిపల్ కమిషనర్ ప్రభాకర్‌రావు పర్యటించి, సీసీ రోడ్డును పరిశీలించారు. పూర్తిస్థాయిలో సీసీ రోడ్డు వేయాలని స్థానికులు కమిషనర్‌ను కోరారు. తమ వార్డులోని సమస్యలను పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని కౌన్సిలర్ సుభద్ర కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు నాగేంద్ర పాల్గొన్నారు.

సీఎం సహకారం మరువలేనిది



మాట్లాడుతున్న దివ్యాంగుల అసోసియేషన్ నాయకులు

హిందూపురం: దివ్యాంగులకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారం అందించి ఏపీపీఎస్సీ ఉద్యోగ నియామకాల్లో 4 శాతం పెంచి రిజర్వేషన్ కల్పించడంపై దివ్యాంజన్ ఎంప్లాయీస్ అసోసియేషన్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో వారు విలేకరులతో మాట్లాడుతూ దివ్యాంగుల ఉద్యోగులకు రావాల్సిన రిజర్వేషన్లు, ఆర్థిక పరమైన ప్రయోజనాలు కల్పించాలని పలు మార్లు విన్నవించినా గత ప్రభుత్వాలు పట్టించుకోలేదన్నారు. దివ్యాంగులపై ప్రేమాభిమానులు చూపుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం జీవో 77 విడుదల చేసి అపార అభిమానం కురిపించిందన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, ఏపీ జీఈఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కాకర్ల వెంకట్రామిరెడ్డి, ప్రభుత్వ అధికారులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నామని దివ్యాంజన్ అసోసియేషన్ నాయకులు శబరీష్‌రెడ్డి, జేపీ రెడ్డి, ధిరాజ్, రమేష్, భాస్కర్, మూర్తి పాల్గొన్నారు.

‘ఆరోగ్య సురక్ష’తో పేదలకు భరోసా



గుడిబండ మండలం శంకరగల్లులో వైద్య పరీక్షలు చేస్తున్న ఎమ్మెల్యే తిప్పేస్వామి

- ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి

గుడిబండ: ప్రజలు సంపూర్ణ ఆరోగ్యానికి జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు కొండంత భరోసా ఇస్తున్నాయని ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి తెలిపారు. శుక్రవారం శంకరగల్లు గ్రామంలో జరుగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని సందర్శించారు. వైద్య శిబిరం ద్వారా ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలను పర్యవేక్షించారు. వైద్య సిబ్బంది వైద్య చికిత్సలు ఎలా అందిస్తున్నారని రోగులను అడిగి తెలుసుకున్నారు. కార్పొరేట్ ఆస్పత్రి తరహాలో గ్రామ స్థాయిలోనే మెరుగైన వైద్య చికిత్సలు అందిస్తున్నారని ప్రజలు ఎమ్మెల్యేకు తెలిపారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన పౌష్టికాహార ఎగ్జిబిషన్‌ను పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే తిప్పేస్వామి రోగులకు వైద్య చికిత్సలు నిర్వహించి మందులను అందజేశారు. డాక్టర్ శాంతి, సిబ్బంది ప్రజలకు వైద్య పరీక్షలు,చికిత్సలు నిర్వహించి ఉచితంగా మందులను అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజలు ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. ప్రజలకు పైసా ఖర్చు లేకుండా వైద్య చికిత్సలతో పాటు కంటి పరీక్షలను నిర్వహించి మందులు, అద్దాలు అందిస్తున్నారన్నారు. మరోసారి ప్రజలు సీఎం వైఎస్ జగన్‌ను ఆశీర్వదించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ జయమ్మ,వక్కలిగ కార్పొరేషన్ డైరెక్టర్ నాగప్ప, ఎంపీడీఓ రామారావు, కార్యదర్శి గోవిందప్ప, వైద్య, ఐసీడీఎస్, సచివాలయ సిబ్బంది, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోండి

గోరంట్ల: ఆరోగ్య సురక్ష శిబిరాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పంచాయితీ అధికారి విజయకుమార్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని గంగంపల్లిలో సర్పంచ్ సుశీలమ్మ ఆధ్వర్యంలో అధికారులు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా పంచాయతీ అధికారి విజయకుమార్‌రెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రఘునాథగుప్త, వైఎస్సార్‌సీపీ నాయకులు , సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

నేడు గుణే మెరుబాగుల్‌లో వైద్య శిబిరం

గుడిబండ: మండల పరిధిలోని గుణేమెరుబాగుల్ గ్రామంలో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ రాధమ్మ, మండల కన్వీనర్ యంజారేగౌడ్ తెలిపారు. అన్ని రకాల వ్యాధులకు డాక్టర్లు వైద్య చికిత్సలు, పరీక్షలు నిర్వహిస్తారన్నారు. గ్రామీణ ప్రజలు వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయం



2వ వార్డులో సంక్షేమ పథకాలు వివరిస్తున్న సమన్వయకర్త టి.ఎస్.దీపిక

- ‘గడప గడపకూ మన ప్రభుత్వం’లో సమన్వయకర్త టీఎన్ దీపిక

హిందూపురం: అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త టి.ఎస్.దీపిక అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 2వ వార్డు చౌడేశ్వరీకాలనీలో కౌన్సిలర్ రామచంద్ర అధ్యక్షతన వైఎస్సార్‌సీపీ నాయకులు, అధికారులతో కలసి ఆమె ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలు, ప్రజలకు చేసిన మేలును వివరించారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు చేరువ చేయడమే జగనన్న ధ్యేయమన్నారు. వలంటీర్లు, సచివాలయ కార్యదర్శులను మీ ఇంటి వద్దకే పంపి సంక్షేమ లబ్ధిని అందజేస్తున్న సీఎం జగన్‌మోహన్ రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని కోరారు. హిందూపురం నియోజకవర్గంలో 30 ఏళ్లుగా గెలుస్తూ వచ్చిన టీడీపీ నాయకులు సరైన రోడ్లు, డ్రైనేజీలు వేయించలేకపోయారన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాకే అభివృద్ధి సాధ్యమైందన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ప్రతి వార్డులో రూ.20 లక్షలు వెచ్చించి రోడ్లు, డ్రైనేజీ నిర్మిస్తామన్నారు. నాడు టీడీపీ పాలనలో జన్మభూమి కమిటీ సభ్యుల చుట్టూ తిరిగి, లంచాలు ఇవ్వందే పింఛన్ కూడా మంజూరు చేయని దుస్థితి ఉండేదన్నారు. నేడు జగనన్న పాలనలో తెల్లవారకమునుపే మీ ఇంటి తలుపుతట్టి అవ్వతాతలకు పింఛన్ డబ్బు చేతికి అందిస్తున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో హిందూపురంలో వైఎస్సార్‌సీపీని ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ డీఈ రాజేంద్రప్రదేశ్, మున్సిపల్ వైస్‌చైర్మన్ జబీవుల్లా, కౌన్సిలర్లు శివ, ఆసీఫ్, షేక్‌రెష్మాబాను, మల్లికార్జున, మణి, వార్డు ఇన్‌చార్జులు, నాయకులు నాగరాజు, మహేష్, చంద్‌బాషా, కవిత,బాబు, గంగాధర్, చంద్రశేఖర్, జుబేర్, అతీక్, రహంతుల్లా, నాగమణి, సహేరాబాను, సచివాలయ సిబ్బంది నాయకులు, కార్యకర్తలు వార్డు ప్రజలు పాల్గొన్నారు.

వాల్మీకి జయంతి జయప్రదం చేయండి

హిందూపురం: వాల్మీకి మహర్షి జయంతి ఉత్సవాలకు విచ్చేయయాలని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త టిఎస్.దీపిక, నియోజకవర్గ నాయకుడు వేణురెడ్డికి వాల్మీకి సేవా సంఘ నాయకులు ఆహ్వానించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సహాయ కార్యదర్శి కొటిపి హనుమంతరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా యువజన విభాగ అధ్యక్షుడు వాల్మీకి లోకేష్, వాల్మీకి సంఘం నాయకులు ఆదినారాయణప్ప, శ్రీనివాసులు , వైటీసీ రాము, సంతోష్, లక్ష్మీనారాయణ, శ్రీనివాసులు, రవికుమార్, కౌన్సిలర్ ఆసీఫ్, సంఘ నాయకులు పాల్గొన్నారు.

పెనుకొండ: మండల కేంద్రమైన సోమందేపల్లిలో శనివారం ఉదయం 9:30 గంటలకు వాల్మీకి జయంతి నిర్వహిస్తున్నట్లు వాల్మీకి సంఘం మండల అధ్యక్షుడు ముష్టికోవెల వెంకటేసులు, వెంకటరత్నం, చంద్రశేఖర్, హనుమంతు, నరసింహమూర్తి, గోవింద్, డీవీ ఆంజనేయులు తెలిపారు. పెనుకొండ పట్టణంలోనూ వాల్మీకి జయంతి వేడుకలు శనివారం నిర్వహిస్తున్నట్లు వాల్మీకి సంఘం నాయకులు అశ్వర్థప్ప, వాల్మీకి జంపు శ్రీనివాసులు, బోయ నరసింహ, బాబు తదితరులు శుక్రవారం తెలిపారు.

అమరాపురం: మండల కేంద్రంలో శనివారం నుంచి మూడు రోజుల పాటు వాల్మీకి మహర్షి 25వ వార్షికోత్సవం, జయంతి ఉత్సవాలను నిర్వహించనున్నట్లు వాల్మీకి కమిటీ సభ్యులు తెలిపారు. చోళేశ్వరి నగర్‌లో వెలసిన ఆంజనేయ స్వామి ఆలయ ఆవరణలో ఉత్సవాలను ప్రారంభిస్తామన్నారు.

రోడ్డు ప్రమాదంలో యాచకుడికి గాయాలు



పెనుకొండ రూరల్: పెనుకొండ 44వ జాతీయ రహదారిపై శుక్రవారం రాత్రి గుర్తుతెలియని వాహనం ఢీకొని యాచకుడికి గాయాలయ్యాయి. స్థానికుల వివరాలు మేరకు.. అమ్మవారిపల్లి కియా మెయిన్ గేట్ ఎదురుగా ఓ ప్రైవేట్ పార్కింగ్ వద్ద పెనుకొండ వైపు నుంచి అనంతపురం వెళ్తున్న గుర్తు తెలియని వాహనం ఓ యాచకుడిని ఢీకొంది. ఘటనలో అతడు తీవ్రంగా గాయపడ్డాడు. కియా స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ క్రిష్ణా అంబులెన్స్ ద్వారా అతడిని పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఎల్‌టీ లైన్ మార్చండి

లేపాక్షి: మండల కేంద్రంలోని సబ్ స్టేషన్ నుంచి పిల్లిగుండు కాలనీ వరకూ ఉన్న ఎల్‌టీ లైన్‌ను మార్చి జాతీయ రహదారి పక్క నుంచి వేయాలని తహసీల్దార్ బాబు, ఏఈ వెంకటేశులకు శుక్రవారం మండలవాసులు వినతిప్రతం అందజేశారు. ఏఈ మాట్లాడుతూ ఈ ఎల్‌టీటి లైన్ మార్పు కోసం ప్రతిపాదనలు పంపామని, నిధులు మంజూరైయిన వెంటనే పనులు ప్రారంభిస్తామన్నారు.

ఆర్టీసీ కొరియర్ సర్వీసులో డోర్ డెలివరీ

హిందూపురం: ఆర్టీసీ పార్శిల్ కొరియర్ సర్వీసు మాసోత్సవాల్లో భాగంగా ప్రజలకు మరింత చేరువ చేయడానికి స్థానికంగా 10 కిలోమీటర్లలోపు 50 కిలోల్లోపు బుగింగ్ డోర్ డెలివరీ సదుపాయం కల్పిస్తామని డీఎం హంపన్న తెలిపారు. ఏపీఎస్ ఆర్టీసీ కార్గో కొరియర్ సర్వీస్ డోర్ డెలివరీ మాసోత్సవాల సందర్భంగా శుక్రవారం డిపో వద్ద గేట్ మీటింగ్ నిర్వహించారు. అవకాశాన్ని పట్టణ పరిసర ప్రాంతాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆర్టీసీ సిబ్బంది ఎం.ఎఫ్ నిషాత్‌కుమార్, ఎం.సీశివప్రసాద్, టి.ఐ.సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

మడకశిర: మండలంలోని యూ.రంగాపురం వద్ద శుక్రవారం 36 లీటర్ల కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ లోకేశ్ తెలిపారు. కే.గుండుమల గ్రామానికి చెందిన కరియన్న, అగళి మండలం పూలపల్లికి చెందిన రంగారెడ్డిని అదుపులోకి తీసుకున్నట్లు పేర్కొన్నారు. వీరి నుంచి రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. మద్యం విలువ రూ.36 వేలు ఉంటుందని తెలిపారు.

అనారోగ్యంతో ఏఈ మృతి

అగళి: మండలం కేంద్రంలో విద్యుత్ శాఖలో ఏఈగా పని చేస్తున్న పత్తిపాటి శ్రీనివాస్ బాబు (43) అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మధ్యాహ్నం మృతి చెందారు.

కార్మికుడికి న్యాయం చేయాలి

హిందూపురం టౌన్: పరిశ్రమలో పనిచేస్తూ ప్రమాదంలో గాయపడిన కార్మికుడికి న్యాయం చేయాలని తూమకుంట పారిశ్రామిక వాడ కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం పట్టణంలోని కార్మికశాఖ అధికారి కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. అలాగే గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కార్మికుడు కేఎస్ బాబును కార్మిక సంఘం, ప్రజా సంఘాల నాయకులు పరామర్శించారు. వారు మాట్లాడుతూ తూమకుంట పారిశ్రామికవాడలోని రోల్‌వెల్ కన్వేయర్స్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమలోని శ్రీహరి మ్యాన్ పవర్ సర్వీస్ అనే కాంట్రాక్టు సంస్థలో పనిచేయుచున్న కేఎస్ బాబు ఈ నెల 25న విధి నిర్వహణలో పెయింటింగ్ చేస్తుండగా ఇనుప దిమ్మె పడటంతో కాలు విరిగిందన్నారు. ఆ పరిశ్రమ యాజమాన్యం అతనికి ఎలాంటి నష్టపరిహారం ఇవ్వలేదని, కనీసం అతనికి పీఎఫ్ ఉంటే లబ్ధి పొందేవాడన్నారు. కేఎస్ బాబు భౌతికంగా కుదుటపడే వరకూ పూర్తి జీతం ఇస్తూ తర్వాత పరిశ్రమలో పర్మినెంట్‌గా ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా గతంలో గాయపడిన జబీవుల్లాకు కూడా పర్మినెంట్ కార్మికుడిగా గుర్తించేలా యాజమాన్యం, లేబర్ కాంట్రాక్టు ఏజెన్సీపై చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో తూమకుంట పారిశ్రామిక వాడ కార్మిక సంఘం అధ్యక్షుడు రవికుమార్, ఓపీడీఆర్ శ్రీనివాసులు, ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ అధ్యక్షుడు వినోద్ కుమార్, నాయకులు బబీవుల్లా, మారుతీ రెడ్డి, తౌసిఫ్, హబీబ్, ముత్యాలప్ప తదితరులు పాల్గొన్నారు.

విలేకరిపై దాడి అమానుషం



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

గోరంట్ల: పట్టణానికి చెందిన ఈ వార్తా న్యూస్ చానల్ (యూట్యూబ్) సంపాదకుడు, సీమ వార్త ఎడిటర్ బీరే ఈశ్వర్ రాయల్‌పై దాడి జరగడం అమానుషమని వైఎస్సార్‌సీపీ నాయకులు ఖండించారు. శుక్రవారం స్థానిక సీటీసీ థియటర్ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తులు ఈశ్వర్ రాయల్‌పై దాడి చేసి, తీవ్రంగా గాయపరిచిన విషయం విదితమే. మండల పార్టీ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ లక్ష్మీనరప్ప, నాయకులు విలేకరులతో మాట్లాడారు. ఈవార్తా న్యూస్ చానల్ రిపోర్టర్ ఈశ్వర రాయల్‌పై జరిగిన దాడిని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. ఈశ్వర్‌రాయల్‌పై ఎమ్మెల్యే దాడి చేయించారని బాధిత కుటుంబ సభ్యులు ఆరోపించడం సరికాదన్నారు. ఈశ్వర్‌రాయల్‌పై దాడి మండల వైఎస్సార్‌సీపీకిగానీ, ఎమ్మెల్యేకు గానీ ఎలాంటి సంబంధం లేదన్నారు. రాజకీయ లబ్ధికోసం టీడీపీ నాయకులు ఈశ్వర్ రాయల్ కుటుంబ సభ్యులను రెచ్చగొట్టి, ఎమ్మెల్యే శంకరనారాయణపై ఆరోపణలు చేయించారన్నారు. ఎమ్మెల్యే శంకరనారాయణ నాలుగున్నరేళ్లలో ఏనాడూ ఫ్యాక్షన్‌ను ప్రోత్సహించలేదన్నారు. రెండు నెలల క్రితం పులేరుకు చెందిన దళితుడు స్టోర్ డీలర్‌ను ఈవార్త చానల్ రిపోర్టర్ ఈశ్వర్‌రాయల్ బ్లాక్ మెయిల్ చేసి డబ్బు డిమాండ్ చేశారన్నారు. స్టోర్ డీలర్ కిష్టప్ప, ఈశ్వర్‌రాయల్ మధ్య వాగ్వాదం జరిగిందన్నారు. ఈశ్వర్ రాయల్ పేపర్, చానల్‌ను అడ్డుపెట్టుకొని జిల్లా వ్యాప్తంగా దందాలు చేస్తూ ఓ రాజకీయ పార్టీకి ఒత్తాసు పలుకుతూ, పత్రిక రంగానికే చెడ్డపేరు తెస్తున్నారన్నారు. ఈ విషయం ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఎవరిని అడిగినా తెలుస్తుందన్నారు. ఈశ్వర్‌రాయల్‌పై దాడి చేసిన వ్యక్తులు ఎంతటి వారైనా ఉపేక్షించొద్దని ఎమ్మెల్యే శంకరనారాయణ పోలీసులను ఆదేశించినట్లు తెలిపారు. పోలీసు విచారణలో వాస్తవాలు తెలుస్తాయన్నారు. సమావేశంలో గోరంట్ల మార్కెట్‌యార్డు అధ్యక్ష, ఉపాధ్యక్షులు బూదిలి వేణుగోపాల్‌రెడ్డి, ఎంపీపీ ప్రమీల, మండల ఉపాధ్యక్షురాలు రామలక్ష్మమ్మ, జిల్లా కోఆప్షన్ సభ్యులు డాక్టర్ బాషా, మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ పోతుల రామకృష్ణారెడ్డి, జిల్లా సహకార బ్యాంక్ డైరెక్టర్ పాటూరి శంకరరెడ్డి, గోరంట్ల ఉప సర్పంచ్ రాజారెడ్డి, పార్టీ పట్టణ కన్వీనర్ ధనుంజయరెడ్డి, మాజీ టౌన్ కన్వీనర్ మేదర శంకర, మండల పార్టీ నాయకులు, సర్పంచులు, ఎంపీటీసీ పాల్గొన్నారు.

సప్పలమ్మ దేవతకు జ్యోతులు



జ్యోతులు మోస్తున్న మహిళలు



జ్యోతులతో ప్రదక్షిణ చేస్తున్న మహిళలు

లేపాక్షి: మండలంలోని కల్లూరు గ్రామంలో వెలిసిన సప్పలమ్మ దేవతకు శుక్రవారం ఉదయం వాల్మీకులు జ్యోతులు మోశారు. ప్రతి ఇంటి నుంచి నది ఒడ్డున ఉన్న ఆలయం వరకూ జ్యోతులు మోసుకుంటూ ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి సమర్పించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేకంగా పూజలు చేశారు. అనంతరం అన్నదానం చేశారు.

వైభవంగా జ్యోతుల ఉత్సవం

రొళ్ల: మండల పరిధిలోని కాకి గ్రామంలో కొల్హాపురి మహాలక్ష్మీ దేవికి శుక్రవారం జ్యోతుల ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. రత్నగిరి గ్రామంలో వెలసిన కొల్హాపురి మహాలక్ష్మీ దేవి ఉత్సవ విగ్రహాన్ని గురువారం సాయంత్రం ఊరేగింపుగా తీసుకువెళ్లి కొలువుదీర్చారు. ఏటా దసరా ఉత్సవాలను పురస్కరించుకుని జ్యోతుల ఉత్సవం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని గ్రామస్తులు తెలిపారు. గ్రామస్తుల ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.

సంక్షిప్త సమాచారం

నేడు విట్టాపల్లిలో వాల్మీకి విగ్రహావిష్కరణ

పరిగి: మండలంలోని విట్టాపల్లిలో శనివారం జరగనున్న వాల్మీకి విగ్రహావిష్కరణకు ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ హాజరవుతున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నరసింహమూర్తి తెలిపారు. ఉదయం 9.30 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు.

కరువు మండలంగా ప్రకటించాలి

లేపాక్షి: మండలాన్ని కరువు ప్రాంత్రంగా ప్రకటించాలంటూ స్థానిక సీపీఐ నాయకులు శుక్రవారం తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు శివప్ప, నారాయణరెడ్డి, గౌతమ్‌కుమార్, మారయ్య, బాలు, నంజిరెడ్డి, నాగభూషణ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలకు వంట సామగ్రి

లేపాక్షి: మండల వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు ఎమ్మార్సీలో శుక్రవారం ఎంఈఓ నాగరాజు వంట సామగ్రి అందజేశారు. అలాగే టాయిలెట్ క్లీనింగ్ టూల్స్‌ను పంపిణీ చేశారు. హెచ్‌ఎంలు, ఎమ్మార్సీ సిబ్బంది పాల్గొన్నారు.

గుడిబండ: మండలంలోని ప్రభుత్వ పాఠశాలలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంఈఓలు గంగప్ప, రవిచంద్ర కుమార్ తెలిపారు. శుక్రవారం పాఠశాలల పరిశుభ్రతకు ప్రభుత్వం సరఫరా చేసిన సామగ్రిని 70 పాఠశాలలకు పంపిణీ చేశారు.

త్వరలో సామాజిక సాధికార బస్సుయాత్ర

మడకశిర: రాష్ట్ర వ్యాప్తంగా వైఎస్సార్‌సీపీ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సామాజిక సాధికార బస్సుయాత్రను త్వరలో రొళ్లలో నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే తిప్పేస్వామి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గంలోని 5 మండలాల నుంచి ఈ సభకు పెద్ద ఎత్తున జనసమీకరణ చేయనున్నట్లు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ బడుగు వర్గాలకు ఎన్నో పదవులు ఇచ్చారన్నారు. ఈ సభకు ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

సందడిగా ఆర్ట్ ఫెస్టివల్

రొళ్ల: మండల పరిధిలోని ఆర్.వడ్రహట్టి ఆర్డీటీ కమ్యూనిటీ భవనం ఆవరణలో రొళ్ల, అగళి మండలాల్లోని వివిధ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ఆర్డీటీ ఆధ్వర్యంలో (ఆర్ట్ ఫెస్టివల్) కళోత్సవం నిర్వహించారు. ఉత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. మండల స్థాయిలో ప్రతిభ కనబరచిన విద్యార్థులు నవంబర్ 14వ తేదీన అనంతపురంలో జరిగే ఆర్ట్ ఫెస్టివెల్‌లో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో ఏటీఎల్ ఓబులేసు, సీఓలు, సీడీసీ మెంబర్లు పాల్గొన్నారు.

మూర్ఛతో వృద్ధురాలి మృతి

హిందూపురం టౌన్: పట్టణంలోని పరిగి బస్టాండ్ సమీపంలో శుక్రవారం ఓ వృద్ధురాలు మూర్ఛతో మృతి చెందింది. మండలంలోని కిరికెర పంచాయతీ వినాయకనగర్‌కు చెందిన వృద్ధురాలు లింగమ్మ(66) యాచకురాలిగా పట్టణంలో జీవనం సాగించేది. శుక్రవారం మూర్ఛ రావడంతో కింద పడింది. ఆమె ముఖానికి గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే 108లో హిందూపురం జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. పోలీసులు ఆమె వద్ద ఉన్న బంగారు నగలు, నగదును కుటుంబ సభ్యులకు అప్పజెప్పారు.

బాల్య వివాహాలతో అనర్థాలు

పావగడ: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని సీడీపీఓ నారాయణ అన్నారు. శుక్రవార స్థానిక సీడీపీఓ కార్యాలయ ఆవరణలో బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది రకీబ్ ఉల్లా, మమత, భాగ్యలక్ష్మి, హనుమక్క, మాదిగ దండోరా జిల్లా అధ్యక్షుడు వళ్ళూరు నాగేశ్, తాలూకా వడ్డెర సంఘం అధ్యక్షుడు బంగారప్ప తదితరులు పాల్గొన్నారు.

గ్యార్మీ వేడుకలు ప్రారంభం

అమరాపురం: మండల కేంద్రంలోని పాత మసీదు, పీర్ల చావిడి వద్ద శుక్రవారం రాత్రి గ్యార్మీ వేడుకలను ముస్లిం సోదరులు ఘనంగా జరుపుకున్నారు. అనంతరం మాబుసుబహనీ జెండాను ఎగురవేశారు. నమాజ్ అనంతరం పాత మసీదు వద్ద విందు ఇచ్చారు.

అయోడైజ్డ్ ఉప్పుతో ఆరోగ్యం

పరిగి: అయోడైజ్డ్ ఉప్పును మాత్రమే ఉపయోగించుకోవాలని మండల వైద్యాధికారులు తెలిపారు. శుక్రవారం మండల కేంద్రం పరిగి కేజీబీవీ, జెడ్పీ స్కూల్, ఊటుకూరులో జాతీయ అయోడిన్ లోప రుగ్మతల నివారణ వారోత్సవాలను నిర్వహించారు. పరిగి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ స్వరూపరెడ్డి, ఊటుకూరు పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్లు స్వరూపరెడ్డి, సురేష్ కుమార్ మాట్లాడారు.

అభివృద్ధి ప్రణాళిక సూచికపై సమీక్ష

రొళ్ల: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక సూచికపై ఈఓఆర్డీ క్రిష్ణప్ప శుక్రవారం కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో నెలకొన్న ప్రధాన సమస్యలను పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. అభివృద్ధి పనులను గుర్తించి మంజూరుకు ఉన్నతాధికారులకు నివేదిక సమర్పించాలన్నారు. సమస్యలు లేని గ్రామాలుగా తీర్చిదిద్దడానికి కృషి చేయాలన్నారు.

అర్హులకు క్రాప్‌లోన్లు ఇస్తాం

అగళి: మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి చైర్మన్ జయరామప్ప, బ్యాంకు మేనేజర్ జయరాం చౌదరి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. సీఈఓ భోజన్న మాట్లాడుతూ.. సొసైటీ బ్యాంకులో అర్హత ఉన్న రైతులకు ఫోర్ వీలర్, టూ వీలర్, ఎల్టి లోన్లు, క్రాప్‌లోన్లు ఇస్తామన్నారు. కార్యక్రమంలో త్రిసభ్య కమిటీ సభ్యులు, సూపర్‌వైజర్ పాపిరెడ్డి పాల్గొన్నారు.

పన్నులు చెల్లించాలి

మడకశిర: 2023–24 సంవత్సరానికి సంబంధించిన వివిధ పన్నులను వెంటనే చెల్లించాలని కమిషనర్ ప్రభాకర్‌రావు శుక్రవారం ఓ ప్రకటనలో ప్రజలను కోరారు. ఆస్తి పన్ను, నీటి పన్ను రూ.10 వేల వరకు బకాయి ఉన్న వారి నీటి కుళాయిలను తొలగిస్తామని తెలిపారు.

సస్యరక్షణ పద్ధతులు పాటించాలి

పరిగి: రైతులు సస్యరక్షణ పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడి వస్తుందని అధికారులు తెలియజేశారు. మండలంలోని గణపతిపల్లిలో మండల వ్యవసాయాధికారుల ఆధ్వర్యంలో మొక్కజొన్న పంటకోత ప్రయోగాలు చేపట్టారు. కార్యక్రమంలతహసీల్దారు సౌజన్యలక్ష్మి, ఏఓ విజయభారతి, సర్పంచ్ లక్ష్మన్న, ఏఎస్ఓ స్నేహ, ఆర్‌బీకే అసిస్టెంట్ సింధూ, వీఆర్వో కృష్ణమూర్తి, రైతులు పాల్గొన్నారు.

ఉపకార వేతనాలు మంజూరు చేయండి

పావగడ: ఈ విద్యా సంవత్సరానికి సంబంధించిన విద్యార్థుల ఉపకార వేతనాలు మంజూరు చేయాలని విద్యార్థి సంఘం నాయకుడు అనిల్ మహదేవ్ డిమాండ్ చేశారు. స్థానిక తాలూకా కార్యాలయంలో శుక్రవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులతో కలసి ఆందోళన చేపట్టారు. అనంతరం తహసీల్దార్ వరదరాజుకు వినతిపత్రం అందించారు.

ప్రజా సమస్యలపై దృష్టి సారించాలి

అమరాపురం: గ్రామ సచివాలయాల పరిధిలోని ప్రజల సమస్యలను వలంటీర్లు సచివాలయ సిబ్బంది సమన్వయంతో పరిష్కరించేందుకు కృషి చేయాలని ఎంపీడీఓ మునిస్వామి సూచించారు. శుక్రవారం స్థానిక గ్రామ సచివాలయం–1లో వలంటీర్లతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో కార్యదర్శి భాస్కర్ పాల్గొన్నారు.



సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

హిందూపురం డివిజన్

9912220723, 9705346587

9010200238, 9912220726